క్లుప్తంగా

విధుల్లో చేరిన ఎస్సై


రమాదేవి

సుజాతనగర్: సుజాతనగర్ మండల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా మాలోత్ రమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా నుంచి రమాదేవి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. పోలీస్ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పూర్వవిద్యార్థుల వితరణ

పాల్వంచరూరల్: చదువుకున్న స్కూల్‌కు పూర్వవిద్యార్థులు సౌండ్‌సిస్టంను వితరణగా అందజేశారు. యానంబైల్ హైస్కూల్‌లో 2008–2009లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా కలిసి పాఠశాలకు రూ.12వేల విలువగల మైకును గురువారం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం టి.రామారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు బుడగం రవి, బొప్పిశెట్టి హరీష్, షేక్ హాజర్, ఎదునూరి సతీష్, ఆవుల సాగర్, కొంపెల్లి నరేష్, ఏనుగ సంపత్, గుమ్మడి స్వప్న పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి..

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్లకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రగతిశీల పంచాయతీ వర్కర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న, జిల్లా నాయకుడు మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలలో నిధులు లేవన్న సాకుతో రెండు నెలలుగా కార్మికుల వేతనాలు నిలిపివేశారని వాపోయారు. పంచాయతీలో ఇతర అవసరాలకు నిధులు పొందుతున్న తమపట్ల చిన్నచూపు ప్రదర్శించడం అన్యాయమన్నారు. ప్రస్తుతం చాలామంది కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామసభ వాయిదా

ఇల్లెందురూరల్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పరిహారానికి సంబంధించి గురువారం మండలంలోని సుభాష్‌నగర్, బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన గ్రామసభ జనం లేక వాయిదా పడింది. జాతీయ రహదారి వెంట ఉన్న పోడుభూములను గుర్తించి అటవీశాఖ నిర్వాసితుల జాబితాను గ్రామసభలో చదివి వినిపించి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్న లక్ష్యంతో అధికారులు గ్రామసభ ఏర్పాటు చేశారు. కానీ గ్రామసభకు అటు పంచాయతీ అధికారులు ఎటువంటి ప్రచారం కల్పించకపోగా ఇటు అటవీశాఖ అధికారులు పోడు భూముల గుర్తింపునకు కనీసం ప్రాథమిక సర్వే కూడా చేయకుండా గ్రామసభకు కూడా గైర్హాజరయ్యారు. మొత్తంగా గ్రామసభకు అధికారులతోపాటు ముగ్గురు వ్యక్తులు మాత్రమే హాజరుకావడంతో తహసీల్దార్ కోట రవికుమార్ గ్రామసభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

రాష్ట్రంలో భవిష్యత్ బీజేపీదే

ఇల్లెందు: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొదుమసింహం పాండురంగాచార్యులు అన్నారు. గురువారం ఇల్లెందులోని రాందేవ్ బాబా సమావేశ మందిరంలో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ఈ దేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలిపాడని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ప్రజలను ముంచి అధికారంలోకి వచ్చాయని, ఏ ఒక్క హామీనీ అమలు చేయటం లేదన్నారు. వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు కులగణన కార్యక్రమం తెరమీదకు తెచ్చిందన్నారు. బీజేపీని పటిష్ట పర్చటంలో గ్రామస్థాయి కార్యకర్తలు, నేతలు బాధ్యతగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాళ్ల సోమసుందర్, గుగులోతు రాంచందర్, రజత్ కోరీ, హంటర్ సతీష్, సంతు, శివం, బాసాని కరుణాకర్, సునిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి మధురబస్తీ 30వ వార్డులో అనుమతులకు విరుద్ధంగా చేస్తున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ నేటికీ అమలు చేయని మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో జన కళ్యాణ్ దివస్ కొరకు జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సామాన్యులకు ఒక చట్టం, బడాబాబులకు ఒక చట్టంలా అధికారులు వ్యవహరిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. బస్టాండ్ వద్ద అక్రమ నిర్మాణంపై 6 నెలల నుంచి బీఎస్పీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మొదలు ముఖ్యమంత్రి వరకు ఫిర్యాదులు చేసినా ఎందుకు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, అదే విధంగా హైకోర్టు ఆదేశాలను అమలు చేయని మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధికి నోచుకోని ఇల్లెందు !

వందేళ్లకు పైగా బొగ్గు ఉత్పత్తికి సహకరించి వెలుగులు పంచడంలో తనకంటూ చరిత్రలో ఒక పేరాను లిఖించుకున్న పట్టణం ఇల్లెందు. అటువంటి ఇల్లెందు నేడు పాలకుల నిరాదరణకు గురవుతోంది. సాగునీటి వనరులు దరిచేరకున్నా.. జాతీయ రవాణా మార్గం దారితప్పినా.. ఉన్నత విద్యా సంస్థలు దూరంగా జరిగినా.. ఉన్న కొద్దిపాటి విద్య, ఉపాధి వనరులు నామమాత్రంగా మారుతున్నా ప్రశ్నించేవారు.. కనీసం అడిగేవారు కూడా కనుచూపు మేరలో కనిపించకపోవడంతో జిల్లాల పునర్విభజన మాదిరిగా ఇల్లెందు అభివృద్ధి కూడా మూడుముక్కలాటలా మారిపోతోంది.

- విసిరేసిన విస్తరాకులా స్థానిక గురుకులాల పరిస్థితి
- సమీకృత గురుకులాల నిర్మాణ ప్రకటనపై ఉత్కంఠ
- రెండో జాబితాలోనైనా చోటు కోసం ఎదురుచూపు


ఆరేళ్లుగా అప్‌గ్రేడ్‌కు నోచుకోని మాణిక్యారం ప్రాథమికోన్నత పాఠశాల

జిల్లసవ్వడి లేక వర్షాధారంపై ఆధారపడుతూ..

ఇల్లెందురూరల్: టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద 2016 ఫిబ్రవరి 16న సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడంతో ఇల్లెందుకు సాగునీటి కొరత తీరుతుందని అందరూ భావించారు. కానీ.. ప్రాజెక్టు నిర్మాణలు సాగుతున్న క్రమంలో ఏం జరిగిందో.. ఏమో కానీ.. గోదావరి జలాలు మాత్రం ఇల్లెందు ఏజెన్సీకి దూరమయ్యాయి. విస్తీర్ణంలో, పంట ఉత్పత్తిలో జిల్లాల్లో పెద్ద మండలాల్లో ఇల్లెందు ఒకటిగా ఉన్నప్పటికీ చెప్పుకోవడానికి వంద ఎకరాలకు నీరిచ్చే సాగునీటి వనరులు లేకపోవడం విచారకరం. ఫలితంగా నేటికీ వర్షాధారంపైనే రైతులు పంటలు సాగు చేసుకోక తప్పడం లేదు.

సాధారణ చదువులకే పరిమితం..

వందేళ్లకు పైగా ఘన చరిత్రతో చారిత్రక ప్రాంతమైన ఇల్లెందులో చెప్పుకోవడానికి గొప్పదైన ఒక్క విద్యాసంస్థ కూడా కనిపించడం లేదు. మండలానికి మంజూరైన మూడు గురుకులాల్లో రెండు ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి. మైనారిటీ గురుకులం మాత్రమే ఇల్లెందులో కొనసాగుతోంది. సుదిమళ్ల గురుకుల కళాశాల ఆవరణలో మహిళా గిరిజన డిగ్రీ కళాశాల మంజూరైనా కారణం తెలియదు కానీ.. శంకుస్థాపనకు ఒకరోజు ముందు అశ్వారావుపేట నియోజకవర్గానికి తరలిపోయింది.

గిరిజన జనాభా అత్యధికంగా ఉన్న ఇల్లెందు మండలం ప్రత్యేకత కలిగిన విద్యాసంస్థలైన ఏకలవ్య, కస్తూర్బా, మోడల్ పాఠశాలలు ఏర్పాటుకు నోచుకోలేదు. కనీసం ఉన్న ఆశ్రమ హైస్కూల్ అప్‌గ్రేడ్‌కు కూడా ఉన్నతాధికారులు అవకాశం ఇవ్వడం లేదు. ఏజెన్సీలో సుమారు 20 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఒక్కటే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉన్నా మరోచోట (మాణిక్యారంలో) అవకాశం ఇవ్వాలన్న ప్రజల విజ్ఞప్తికి కూడా ఉన్నతాధికారులు స్పందించడం లేదు. ఉన్న ఒక్కగానొక్క డిగ్రీ కళాశాల సౌకర్యాల కొరత, నిధుల మంజూరులో చిన్నచూపు, అనుబంధ వసతి గృహాల మంజూరు లేకపోవడంతో విద్యార్థుల చేరిక క్రమంగా తగ్గుముఖం పడుతూ.. ఎప్పుడు మూతపడుతుందో తెలియని దుస్థితిలోకి నెట్టివేయబడుతోంది. గత ఎన్నికల సమయంలో ఇల్లెందుకు ఐటీఐ కళాశాల మంజూరు చేస్తున్నట్లు అప్పటి పాలకులు ప్రకటించినా నేటికీ ఆచరణలో కదలిక లేకపోవడంతో ప్రకటనకే పరిమితమైందన్న భావనలో యువత నిట్టూరుస్తున్నారు.

ఎండమావిగా ఉపాధి వనరులు..

దేశం గర్వించేంతటి పరిశ్రమకు జన్మనిచ్చిన ప్రాంతం ఇల్లెందు. బొగ్గుతోపాటు తరగని ఖనిజ సంపద ఇల్లెందు భూగర్భంలో విస్తరించి ఉంది. దేశం నలుమూలల నుంచి ఇక్కడికి వందేళ్లకు పైగా ఎంతోమంది ఉపాధి పొందారు. కానీ నేడు ఉపాధి కోసం ఇల్లెందు వాసులు ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సిన దుస్థితి. యువతకు పలురంగాలలో స్వయం ఉపాధికి శిక్షణ ఇచ్చేందుకు ఇల్లెందులో ఏర్పాటు చేసిన యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ) నామమాత్రంగా మారిపోయింది. ఇదే విషయాన్ని ఇటీవల ఇల్లెందులో పర్యటించిన ఐటీడీఏ పీఓ రాహుల్ కూడా వైటీసీ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. యంత్రాల రంగ ప్రవేశంతో వ్యవసాయ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి.

సమీకృత గురుకులమైనా..

రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలను ఒకచోట చేర్చి 25 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక వసతులు, సౌకర్యాలతో భవనాలను నిర్మిస్తామని ప్రకటించింది. తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో మూడు నియోజకవర్గాలలో మంజూరు చేసింది. రెండో విడతలోనైనా ఇల్లెందుకు అవకాశం కల్పిస్తారో.. గోదావరి నీళ్ల మాదిరిగా దారిమళ్లిస్తారోనని స్థానిక ప్రజలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

విద్యాసంస్థలే ప్రగతికి పునాదులు


ఉన్నతమైన విద్యాసంస్థల అందుబాటులో ఉన్నప్పుడే ఏ ప్రాంతమైనా కాలక్రమంలో అభివృద్ధి చెందుతుంది. కానీ చారిత్రక ప్రాంతమైన ఇల్లెందు దశాబ్దాలుగా ఆ అవకాశానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా సమీకృత గురుకులాల సముదాయాన్ని ఇల్లెందుకు మంజూరు చేసి న్యాయం చేయాలి.

– చిన్నూరి సుధాకర్, సుభాష్‌నగర్

ప్రజాప్రతినిధులు స్పందించాలి


రహదారులు, భారీ భవనాల నిర్మాణం కంటే సాధారణ, సాంకేతిక విద్యా సంస్థల ఏర్పాటు ద్వారా సమకూరిన ఉపాధి అవకాశాలే అభివృద్ధికి తొలిమెట్టు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఇల్లెందులో ఉన్నతమైన విద్యాసంస్థల ఏర్పాటుకు కృషి చేయాలి.

– వాంకుడోత్ విజయ్, ఇల్లెందు

విద్య ద్వారానే ఉన్నత స్థితి


మాట్లాడుతున్న డీఎస్పీ సతీష్‌కుమార్

కొత్తగూడెంరూరల్: వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత స్థితికి చేర్చుతుందని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా వైద్య కళాశాలలో ర్యాగింగ్ మహమ్మారిని తరిమివేయాలని వైద్య విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ పాల్గొన్ని మాట్లాడుతూ.. విద్యార్థుల ఏకాగ్రతకు దెబ్బతీసే ర్యాగింగ్ మహమ్మారిని తరిమి వేయాలన్నారు. దుష్ప్రభావాలను ర్యాగింగ్ చేసే విద్యార్థులకు తెలియజేసి వారిలో మార్పు కోసం ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ ఎస్ఐ సుమన్, జిల్లా షీటీమ్స్ ఎస్సై రమాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాల రవాణాపై నిఘా పెట్టాలి


బోడు పోలీసు స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి: పోలీసులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఇల్లెందు డీఎస్పీ ఎన్.చంద్రభాను అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని బోడు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఎవరికి కేటాయించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను అక్రమంగా రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు నిత్యం పెట్రోలింగ్ నిర్వహించాలని, విధుల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులో సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మావోయిస్టు కదలికలపై నిఘా పెట్టాలని ఎప్పటికపుడు సమాచారం సేకరించాలని సిబ్బందికి సూచించారు. టేకులపల్లి సీఐ సురేష్, ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరం..

ఆదివాసీల సంక్షేమం, ఆరోగ్య సంరక్షణే ప్రధాన లక్ష్యమని ఇల్లెందు డీఎస్పీ ఎన్.చంద్రభాను అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు బోడు పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సిద్ధారంలోని గుత్తికోయల గ్రామంలో సులానగర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో కలిసి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్, బోడు ఎస్ఐ పాడిశెట్టి శ్రీకాంత్, ఐడీఓ ట్రస్ట్ వైద్యాధికారి డాక్టర్ భద్రు నాయక్, సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, హెల్త్ సూపర్‌వైజర్ పోరండ్ల శ్రీనివాస్, ధనసరి రాంబాబు, అరుణాదేవి, స్రవంతి, సారమ్మ పంచాయతీ కార్యదర్శి కోరం సునీల్ కుమార్, మాజీ ఎంపీటీసీ కొరస ఈశ్వరయ్య, పటేల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పీసా చట్టాన్ని అమలు చేయండి..


నరేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజేష్‌నాయక్

ఇల్లెందు: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని 8 మండలాల్లో గిరిజనేతర వ్యాపారులు పొందిన లైసెన్సులు రద్దు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పీసా (పంచాయతీ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్డ్ ఏరియా) చట్టాన్ని పటిష్టగా అమలు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... ఏజెన్సీలో గిరిజనేతర వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి గిరిజన చట్టాలను ఉల్లంఘించి కొనుగోళ్లు జరుపుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పత్తి రైతులకు అన్యాయం జరుగకుండా చూడాలని కోరారు. ఇదిలా ఉండగా పల్లెల్లో పత్తికి సరసమైన ధర ఇవ్వకుండా దళారులు గిరిజనులను నిలువునా ముంచుతున్నారని వాపోయారు. గిరిజనులకే లైసెన్సు ఇచ్చి వ్యాపారులుగా ప్రోత్సహించాలని కోరారు.

సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాజు

సింగరేణి(కొత్తగూడెం): మండల కేంద్రాలలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా సహాయ కార్యదర్శి నాయిని రాజు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పత్తి పంట చేతికొచ్చి నెలరోజులు దాటుతున్నా సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో పత్తి అధిక దిగుబడులు వస్తున్న జూలూరుపాడు మండల కేంద్రంలోని ఉప మార్కెట్ యార్డ్‌ను శాశ్వత వ్యవసాయ మార్కెట్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర పాలకుల కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల వల్ల దేశ ప్రజలు, రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులు పండిస్తున్న అన్ని పంటలకు మద్దతు ధర వ్యవసాయ ఖర్చుకు 50శాతం అదనంగా జోడించి అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి 5.35 శాతం పెంచి వరి క్వింటాకు రూ.2300 మద్దతు ధర నిర్ణయించిందని రైతుల డిమాండ్ ప్రకారం పంటల పెట్టుబడి ఖర్చు అదనంగా 50శాతం కలిపి మద్దతు ధరలను పెంచడం లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ముందు రైతులందరికీ రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక మరిచిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ నవంబర్ 26న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని ఎస్‌కేఎం కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సమావేశంలో ఆర్.మధుసూదన్‌రెడ్డి, యాకూబ్‌షావలీ, ఏదులాపురం గోపాలరావు, బానోత్ ధర్మా, కల్లూరి కిషన్, ఎం.రాజశేఖర్, సతీష్ పాల్గొన్నారు.

వాహనాల టెండర్‌కు డ్రా

ఇల్లెందు: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలోని జేకే ఓసీ, హాస్పిటల్‌లో అద్దె వాహనాల కోసం అక్టోబర్‌లో దరఖాస్తు చేసుకున్న భూనిర్వాసితులకు ఈ నెల 26న డ్రా నిర్వహిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. టెండర్ ప్రక్రియకు దరఖాస్తు చేసుకున్న వారి సమక్షంలో ఓపెన్ చేస్తామని తెలిపారు. ఈ నెల 26న సాయంత్రం 3 గంటలకు అందరూ హాజరు కావాలని కోరారు.

23న సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

కొత్తగూడెంటౌన్: 23న పాల్వంచలో శ్రీనివాస కాలనీలో జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు 8, 10, 12 ఏళ్ల లోపు బాల బాలికలకు 50, 100, 300, 400, 600 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలను డిసెంబర్ 1న మంచిర్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు.

24న వనసమారాధన

కొత్తగూడెంటౌన్: రైటర్‌బస్తీలోని శ్రీ గణేష్ ఆలయంలో 24వ తేదీన బ్రహ్మణ సమాఖ్య కార్తీక వనసమారాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఎస్.వి రమణమూర్తి అన్నారు. గురువారం ఆలయంలో మాట్లాడారు. అందరూ కుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

26న ప్రజా భవన్ ఎదుట నిరసన

ఇల్లెందు: ఐటీడీఏ ఉపాధ్యాయుల అప్‌డేట్ ఆలస్యాన్ని నిరసిస్తూ ఈ నెల 26న ప్రజా భవన్ ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి నిరసన, ఆందోళన చేపడుతున్నట్లు ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ మాలోతు ప్రతాప్ సింగ్ నాయక్ తెలిపారు. ఇల్లెందులో గురువారం ఆయన మాట్లాడుతూ... మూడు ఐటీడీఏల పరిధిలోని బాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు, తెలుగు, హిందీ, పీఈటీ వారు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సుమారు 350 మంది విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా, మండల పరిషత్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చిన ప్రభుత్వం తమ పట్ల సవితి తల్లి ప్రేమను చూపుతోందని తెలిపారు.

28న స్ట్రక్చరల్ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 28న సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్(పా)తో స్ట్రక్చరల్ సమావేశం జరగనుంది. గుర్తింపు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సెంట్రల్ కమిటీ సభ్యులు, డైరెక్టర్(పా), వివిధ విభాగాల జీఎంలు పాల్గొననున్నారు. సంస్థలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు, వాటి నివారణ అంశాలపై చర్చించనున్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణం కూలీ లైన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. గురువారం జరిగిన ఈ పోటీలలో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లాలు సింగ్, సైన్స్ టీచర్ దేవీలాల్, రవీందర్, జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వెంకటేశర్లు తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాలలో ..

లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి మండల స్థాయి పోటీలలో త్రివేణి విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. మనస్వి 10వ తరగతి అక్షయ్ 9వ తరగతి, అదీప్ 8వ తరగతి మొదటి స్థానం సాధించి, జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాలల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి అభినందించారు.

పాల్వంచ: పట్టణంలోని బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో జరిగిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో స్వాతి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కె.అభినవ సాయి(పదో తరగతి), కె.జోసహస్ర (9వ తరగతి), జె.ఆదర్శ (8వ తరగతి) విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థులను కరస్పాండెంట్ శ్రీనివాస్ చౌదరి, ప్రిన్సిపాల్ నీలిమ చౌదరి అభినందించారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌కు ఎంపిక


ఇల్లెందురూరల్: ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు


టేకులపల్లి: గీతను అభినందిస్తున్న ఎంఈఓ

ఇల్లెందురూరల్: 52వ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని చెన్నంగులగడ్డ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు భద్రాచలం ఐటీడీఏ స్థాయిలో సత్తాచాటారు. భౌతికశాస్త్రం ఉపాధ్యాయులు ఎం.సుమతి, నాగేశ్వరరావు, ప్రసన్న సహకారంతో 'లో కాస్ట్ –నోకాస్ట్'మెటీరియల్స్‌తో 'హైడ్రాలిక్ లిఫ్ట్', 'చంద్రయాన్', 'సోలార్ పవర్ ఇరిగేషన్ సిస్టమ్'అంశాలలో ప్రాజెక్టులు ప్రదర్శించి ప్రథమ స్థానం పొందారు. ఈ మేరకు ప్రశంసాపత్రాన్ని విద్యార్థులు పవన్, అఖిల్, కిరణ్, అరుణ్‌కుమార్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేతుల మీదుగా అందుకున్నారు.

టేకులపల్లి: ఈనెల 18న అన్నపురెడ్డిపల్లిలో జరిగిన జిల్లా సైన్స్ ఫేర్‌లో ప్రతిభను కనబరిచిన టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎస్.గీత రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌కు ఎంపికైంది. వి.శ్రీహరిణిపమార్, ఎస్.గీత, ఎస్.హర్షితలు మండల స్థాయిలో జరిగిన చెకుముకి టాలెంట్ టెస్టులో ప్రథమ స్థానం పొంది జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికయ్యారు. విద్యార్థులను, గైడ్ టీచర్ మోహన్‌రావుని ఎంఈఓ జగన్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కోయగూడెం ఆశ్రమ పాఠశాల ఏడో తరగతి విద్యార్థి బి.ధోని జిల్లా సైన్స్ ఫేర్‌లో జిల్లా మూడో బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం అమర్ సింగ్ తెలిపారు.

వైరా ఎమ్మెల్యే సోదరుడి మృతికి సంతాపం


పాడె మోస్తున్న ఎమ్మెల్యే రాందాస్

కొత్తగూడెంరూరల్/జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సోదరుడు, కారుకొండ మాజీ సర్పంచ్ బలరాంనాయక్ తండ్రి మాలోతు వాల్యా(80) బుధవారం రాత్రి మృతి చెందాడు. లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండకు చెందిన ఆయన కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ మేరకు గురువారం ఉదయం ఎమ్మెల్యే రాందాస్, నాయకులు వాల్యా మృతదేహం వద్ద నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వివిధ పార్టీల నాయకులు సాబీర్‌పాషా, కొత్వాల శ్రీనివాసరావు, నాగ సీతారాములు, మండే వీరహనుమంతరావు, బిక్కసాని నాగేశ్వరరావు, కొడాలి రత్నాకర్, ఏనుగుల అర్జున్‌రావు, చింతపుడి రాజశేఖర్, కూచిపుడి జగన్, లేళ్ల వెంకటరెడ్డి, అల్లాడి నరసింహారావు, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు, ధరావత్ రాంబాబు, నున్నా కృష్ణయ్య, తదితరులు కూడా సంతాపం తెలిపారు.

విద్యార్థుల శ్రమదానం


శ్రమదానం చేస్తున్న వలంటీర్లు

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం శ్రమదానం చేశారు. కార్యాలయ ఆవరణతోపాటు, ప్రధాన కూడలిలోని ఆటోస్టాండ్ వద్ద పిచ్చిమొక్కలను తొలగించి ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను సేకరించి డంప్‌యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతీ ఇంటి ఆవరణను శుభ్రంగా ఉంచుకునేలా అవకాశం ఉన్న ప్రతీ సందర్భంలోనూ ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండాలని, లేనిపక్షంలో రోగాల బారిన పడి ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వరరావు, శేఖర్, పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని సంయుక్త కిసాన్ మోర్చా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు కార్మిక కోడ్‌ల వలన కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ఎనిమిది గంటల పనిదినం హక్కులు వంటి హామీలు రద్దు చేస్తున్నారన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక సంఘాలు కొన్ని సంవత్సరాలుగా పోరాడుతున్నాయని గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలలను ప్రతిగటిస్తూ ఏడాది నుంచి పలు రైతు సంఘాలు పోరాటాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ పలు మల్టీ నేషనల్ కార్పొరేట్లతో వ్యవసాయ పరిశోధనల కుదుర్చుకుంద న్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అద్దెకివ్వడం సరికాదన్నారు. దేశంలో సుమారు 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఈ లేబర్ కోడ్‌లతో బానిసత్వంలోకి నెట్టబడ్డారని తెలిపారు. ఇట్టి సమస్యల సాధనకు ఈనెల 23న కొత్తగూడెం పట్టణంలో బైకు ర్యాలీ, 26న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాలను నిర్వహించటానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు కంచర్ల జమలయ్య, చంద్రగిరి శ్రీనివాస్‌రావు, అన్నవరపు సత్యనారాయణ, బి.ప్రసాద్, యాకూబ్‌షావలీ, సారంగపాణి, రామ్‌సింగ్, వీరన్న పాల్గొన్నారు.